సాక్షి రంగారెడ్డి

బుధవారం, 7, ఆగస్టు, 2024



'నయానగరి'పై నజర్

నయానగరి (ఫోర్త్‌సిటీ) నిర్మాణంలో అడ్డంకులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. 8లో▸



హక్కులు సాధించుకుందాం

కల్లుగీత కార్మికుల హక్కులను పోరాడి సాధించుకుందామని కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. 8లో▸



అట్రాసిటీ నమోదు చేయాలి

దళిత మహిళను చిత్రహింసలు పెట్టిన పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

డిగ్రీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీజెడ్సీ, ఎంబీజెడ్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీకాం (సీఏ), బీకాం (జనరల్), బీఏ కోర్సుల్లో చదవాలనుకునే ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు అవకాశాలు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి విద్యార్హతలను బట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 79956 60881 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు

- మనస్తాపంతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య
- మృతురాలు నాలుగు నెలల గర్భిణి



శ్రీలత (ఫైల్)

మీర్‌పేట: అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం. నగరంలోని జియాగూడకు చెందిన మధురవేణి, రమేశ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు శ్రీలత (26)ను 2021లో సైదాబాద్ నివాసి, ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పనిచేసే మామిడి సాయిభార్గవ కృష్ణకు ఇచ్చి కట్నకానుకలతో వివాహం జరిపించారు. వీరికి ఏడాదిన్నర చిన్నారి శాన్వి ఉంది. రెండు నెలలుగా బడంగ్‌పేట గాయత్రిహిల్స్‌లో సొంత ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. ఈక్రమంలో కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్త కలిసి శ్రీలతను వేధిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. తమ కూతురు ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి అని, అదనపు కట్నం వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

తుర్కయంజాల్: పుర పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 22, 19 వార్డుల్లో మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్లు కోశిక ఐలయ్య, నారని కవితతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మైనార్టీ పాఠశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. వనమహోత్స వం కార్యక్రమంలో భాగంగా టీచర్స్ కాలనీలో కా లనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్ గౌడ్, కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కొ త్తకుర్మ మంగమ్మ, రమావత్ కళ్యాణ్ నాయక్, డీఈ సత్యనారాయణ, మేనేజర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

తిమ్మాయిపల్లిలోని సర్వే నంబర్ 9లో ఐటీ కంపెనీల కోసం సేకరించనున్న భూమి



కందుకూరు.. రూపు మారు

ఇటీవల నెట్ జీరో సిటీ ఏర్పాటుకు సీఎం శ్రీకారం

- మండలంలో కొలువుదీరనున్న పలు ఐటీ కంపెనీలు
- భూ సేకరణకు అధికారుల సన్నాహాలు
- ఊపందుకోనున్న రియల్ రంగం
- మారిపోనున్న రూపు రేఖలు

కందుకూరు: నెట్ జీరో సిటీ ఏర్పాటుకు ఇప్పటికే మండల పరిధిలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టగా వాటి సరసన చేరడానికి ఐటీ హబ్ కూడా త్వరలో రానుంది. దీంతో ఈ ప్రాంతం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఈ మేరకు అధికారులు భూసేకరణకు సన్నాహాలు చేస్తున్నారు. తిమ్మాయిపల్లి, తిమ్మాపూర్ పరిధిలోని ప్రభుత్వ అసైన్డ్ భూములు దాదాపు 933 ఎకరాలను సేకరించడానికి నిర్ణయించారు.

ఇప్పటికే 3,983 ఎకరాలు

ఫార్మాసిటీ కోసం మండలంలో గతంలో 3,983 ఎకరాలు సేకరించారు. మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్లు 112, 120, పంజుగూడ సర్వే నంబర్లు 90, 91, ముచ్చర్ల సర్వే నంబర్లు 123, 186, 306,140, 155, 156, 157, 288లలో మొత్తం 3,983.04 ఎకరాలను ప్రభుత్వం సేకరించి టీజీఐఐసీకి అప్పగించింది. వీటితో పాటు యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలో మరో పది వేల ఎకరాలను సేకరించారు. అందులో ప్రస్తుతం దాదాపు రెండు వేల ఎకరాల వరకు వివిధ వివాదాలు, కోర్టు కేసుల్లో ఉండగా 12 వేల ఎకరాలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఆ భూముల్లో గత ప్రభుత్వం ప్రతిపాదించిన ఫార్మా సిటీని రద్దు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇటీవల నెట్ జీరో సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో 57 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సీఎం శంకుస్థాపన సైతం చేశారు. ఆ సమీపంలోని బేగరికంచె పరిధిలో రైతులకు ఇచ్చే ప్లాట్లలో అభివృద్ధి పనులు చేపట్టేలా శంకుస్థాపనలు చేశారు. దీంతో అక్కడ పనులు ఊపందుకున్నాయి.

భూ సేకరణకు ప్రణాళికలు

నెట్ జీరో సిటీకి సేకరించి రైతుల కోసం అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌కు ఆనుకుని తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9లో ఉన్న 366.04 ప్రభుత్వ, అసైన్డ్ భూములను, తిమ్మాపూర్ సర్వే నంబర్లు 38, 162లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములు 567 ఎకరాలతో కలిపి మొత్తం 933 ఎకరాలను సేకరించడానికి అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. తిమ్మాపూర్‌లో ప్రభుత్వ భూముల మధ్యలో అక్కడక్కడ ఉన్న ప్రైవేట్ భూములను సైతం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ రెండు గ్రామాల్లో సేకరించే భూముల్లో ఐటీ కంపెనీలు నెలకొల్పనున్నారు.

వ్యాపారుల నజర్

నెట్ జీరో సిటీతో పాటు ఐటీ కంపెనీల స్థాపనతో మండలంలో అభివృద్ధి శరవేగంగా జరగనుంది. ఒకవైపు కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ నుంచి బేగరికంచె ఫార్మా రహదారి వరకు 200 అడుగుల రహదారితో పాటు మెట్రో నిర్మాణానికి అధికారులు సర్వే చేస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్‌కు ఊతమిచ్చినట్లయింది. కొన్ని నెలలుగా ఈ ప్రాంతంలో స్తబ్ధుగా ఉన్న రియల్ రంగం పరుగులు పెట్టనుంది. ఇటీవల సీఎం శంకుస్థాపనలు చేసి వెళ్లినప్పటి నుంచి రియల్ వ్యాపారుల దృష్టి ఇటువైపు మళ్లింది.

ఐటీ కంపెనీల కోసం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు తిమ్మాయిపల్లి సర్వే నంబర్ 9, తిమ్మాపూర్ సర్వే నంబర్లు 38, 162లలోని ప్రభుత్వ అసైన్డ్ భూములు దాదాపు 933 ఎకరాలు సేకరించడానికి నిర్ణయించాం. ఆ భూముల్లో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయనున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే రైతులతో సంప్రదింపులు చేపట్టి భూసేకరణ పనులు ప్రారంభిస్తాం.

– సూరజ్‌కుమార్, ఆర్డీఓ, కందుకూరు

సుముహూర్తాల వేళ



- శ్రావణ మాసం వచ్చేసింది..
- శుభ ముహూర్తాలు తెచ్చేసింది
- నేటి నుంచి మోగనున్న పెళ్లిభాజాలు
- ఒక్కటి కానున్న వందలాది జంటలు
- ఈనెల 28 వరకు పండుగ వాతావరణం
- ఊరూవాడా ఇక సందడే సందడి

షాబాద్/మొయినాబాద్‌రూరల్: ఆషాఢ మాసం ముగిసి శ్రావణం వచ్చేసింది. వస్తూనే శుభముహూర్తాలను తీసుకొచ్చింది. ఇక పచ్చని పందిళ్లు.. మామిడి తోరణాలు.. వేదమంత్రాలు.. మేళతాళాలు.. బాజాభజంత్రీలతో ఊరూవాడా పెళ్లి సందడి కనిపించనుంది. యువతీయువకుల నిరీక్షణకు తెరపడనుంది. సుముహూర్తాల వేళ వందలాది జంటలు ఒక్కటి కానున్నాయి. ఏడడుగుల బంధంలోకి అడుగుపెట్టబోతున్నాయి. ఈనెల 7వ తేదీ (బుధవారం) నుంచి 28వ తేదీ వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. తర్వాత వచ్చే 65 రోజుల పాటు మంచి ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు చేసుకునేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వ్యాపారాలకు జోష్..

ఆషాఢ మాసం విరామం తర్వాత మళ్లీ పెళ్లి ముహూర్తాలు మొదలు కావడంతో అనుబంధ వ్యాపారాలు జోరందుకోనున్నాయి. పౌరోహిత్యం, వస్త్ర, బంగారు దుకాణాలతో పాటు సన్నాయి మేళాలు, వంట మనుషులు, ప్రింటింగ్ ప్రెస్, లైటింగ్, డెకరేషన్, టెంట్, పెళ్లి మండపాలు, ఫొటో, వీడియో గ్రాఫర్లకు చేతి నిండా పని దొరకనుంది. ఆషాఢ మాసానికి ముందుగానే పెళ్లి నిశ్చయించుకున్న వారు కల్యాణ మండపాలకు అడ్వాన్స్‌లు ఇచ్చేశారు. ఎవరి స్థోమతను బట్టి వారు పెళ్లికార్డులు.. ఫ్లెక్సీలు, షామియానాలు, ఊరేగింపులు, సెట్టింగ్, డీజేలకు ప్రాధాన్యం ఇస్తూ ముందస్తు ఒప్పందాలు కదుర్చుకున్నారు. ఈ నెల 7, 8, 9, 11, 13, 14, 15, 17, 18, 19, 22, 23, 24, 26, 28 తేదీల్లో శుభముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. అబ్బాయి, అమ్మాయి పేరున కలిసి వచ్చే ముహూర్తాలను నిర్ణయించుకుని, వివాహ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా జరిపించేందుకు పెద్దలు సిద్ధమవుతున్నాయి.

ఈ నెల 28 వరకే..



ఈనెల 7 నుంచి 28వ తేదీ వరకు పెళ్లిళ్లతో పాటు ఇతర శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. 29 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు మంచి ముహూర్తాలు లేవు. అబ్బాయి, అమ్మాయి జన్మనక్షత్రంతో కలిసి వచ్చిన ముహూర్తం ప్రకారం పెళ్లిళ్లకు తేదీలు ఖరారు చేస్తున్నాం.

– రమేశ్ పంతులు, తాళ్లపల్లి, షాబాద్

పెళ్లిళ్లకు అనుకూలం



శ్రావణ మాసంలో చాలా ముహూర్తాలున్నాయి. ఈ నెల 7, 8, 9, 11, 13, 14, 15, 17, 18, 19, 22, 23, 24, 26, 28 తేదీలు పెళ్లిళ్లకు అనుకూలం. సెప్టెంబర్‌లో ముహూర్తాలు లేవు. మళ్లీ అక్టోబర్‌లో ప్రారంభమై, 2025 ఏప్రిల్ వరకు ఉన్నాయి.

– శ్రీను పంతులు, షాబాద్



ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మనుగడ

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

షాబాద్: పచ్చదనం, వాతావరణ సమతుల్యానికి మొక్కలు నాటాలని, రోగాలు దరిచేరకుండా వరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పైల్వాన్ చెరువు, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులు, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డులను ఎంపీడీఓ అపర్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సెగ్రిగేషన్ షెడ్‌ను తనిఖీ చేసి తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు తయారు చేయాలని సూచించారు. నెల రోజుల్లో కంపోస్టు ఎరువులు తయారు చేసి తనకు ఫొటోలు పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. మొక్కలు నాటి అడవులను పెంచేందుకు కృషి చేస్తే భవిష్యత్‌తరాల వారికి ఎంతో మేలు చేసినవారం అవుతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త, డ్రైనేజీలో మురుగు నిల్వకుండా, పిచ్చి మొక్కలు, పొదలు తొలగించాలన్నారు. వాటర్ లీకేజీలుంటే సరిచేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులను షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

జయశంకర్‌కు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

తుక్కుగూడ: ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతిని కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి కలెక్టర్ శశాంక ఆయా శాఖల అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, అసమానతలపై తీవ్రంగా పోరాటం చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఏఓ నర్సింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ ఆశయాలను కొనసాగిద్దాం



గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

చేవెళ్ల: ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆశయాలను కొనసాగిద్దామని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గద్దర్ మొదటి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాడిత పీడిత ప్రజలకోసం నిరంతరం పోరాడి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పోరాట యోధుడు గద్దర్ అని కొనియాడారు. జీవితంలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పేద ప్రజల సమస్యలను తన పాటతో ప్రశ్నించారన్నారు. గిరిజన ఆదివాసి భూమి హక్కుల కోసం వీరోచిత పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అల్లవాడ మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, టి.ప్రవీణ్, కోశాధికారి ఎం.వినోద్, మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ అంతంతే!

- ముందుకు సాగని పంట సాగు
- మొక్కలు, డ్రిప్‌లకు డీడీలు కట్టి ఎదురుచూపులు
- సరఫరాపై కరువైన స్పష్టత
- రైతులకు లభించని ప్రోత్సాహం
- పట్టించుకోని అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆయిల్‌పామ్ పంట జిల్లాలో ఆశించిన స్థాయిలో సాగడం లేదు. పంట సాగుకు రైతులు ముందుకు వచ్చినా.. ఉద్యానవనశాఖ నుంచి సరైన మద్దతు లభించడం లేదు. సాగుపై రైతులకు అవగాహన కల్పించి, వారిని ప్రోత్సహించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలువురు రైతులు మొక్కలు, డ్రిప్‌ల కోసం డీడీలు చెల్లించినా.. వారి నుంచి కనీస స్పందన లభించడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆశయం నెరవేరకుండా పోతోంది.

5,500 ఎకరాలు లక్ష్యం

ప్రపంచవ్యాప్తంగా వంటనూనెకు డిమాండ్ పెరిగింది. దీంతో ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు పెద్దపీట వేసింది. ఈ మేరకు రైతులను ఎంపిక చేసి సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. జిల్లాలో ఈ ఏడాది 5,500 ఎకరాల్లో పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు 760 మంది రైతులు 3,292 ఎకరాల్లో సాగు చేసేందుకు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొక్కల పంపిణీ, డ్రిప్ సహా మార్కెటింగ్ కల్పన వంటి అన్ని బాధ్యతలను వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసు ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించింది.

512 ఎకరాలకు మించలే..

ఇప్పటి వరకు 238 మంది రైతులకు 979 ఎకరాలకు పాలనా పరమైన అనుమతులు జారీ చేసింది. 512 ఎకరాల్లో మాత్రమే మొక్కలు నాటించింది. ఒక్కో మొక్కకు రూ.20 ధర నిర్ణయించింది. సబ్సిడీపై అందించే డ్రిప్‌ల కోసం రైతులు తమ వాటా డబ్బులు కూడా చెల్లించారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీ, బీసీలకు 90శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీపై డ్రిప్‌లను అందించనున్నట్లు ప్రకటించింది. రైతులు తమ వాటా ఇప్పటికే చెల్లించారు. రూ.లక్షలు ఖర్చు చేసి భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. బోర్లు వేసి, భూమిని చదును చేసి, గుంతలు తీసి రెడీగా ఉంచారు. ఉద్యానశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు ఆయా రైతులకు బిందు సేద్యం పరికరాలే కాదు మొక్కలు కూడా సరఫరా చేయకపోవడంతో ఔత్సాహికులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఉద్యనవనశాఖ అధికారి బదిలీపై వెళ్లడం, కొత్తవారు రావడం, సబ్సిడీకి సంబంధించిన ఫైలు కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉండడమే జాప్యానికి కారణమని అధికా రులు చెబుతుండటం కొసమెరుపు.



స్పష్టత ఇవ్వడం లేదు

ఇబ్రహీంపట్నం, యాచారం మండల సరిహద్దులోని చింతుల్లా రెవెన్యూ పరిధిలో పదెకరాల భూమి ఉంది. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ప్రకటన చూసి ఆయిల్‌పామ్ సాగు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే రూ.3 లక్షలు ఖర్చు చేసి చుట్టూ ఫెన్సింగ్, నాలుగు బోర్లు, మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేశాం. నెలన్నర క్రితమే మొక్కలు సహా డ్రిప్‌నకు వాటా డబ్బులు చెల్లించాం. హార్టికల్చర్ ఆఫీసర్లు కూడా విజిట్ చేశారు. తర్వాత ఫోన్ చేసినా స్పందించడం లేదు. రిజిస్ట్రేషన్ చేయడంలోనూ తీవ్ర జాప్యం చేశారు. మొక్కలు ఎప్పుడిస్తారనే అంశంపై స్పష్టత ఇవ్వడం లేదు.

– వంగా మనోహర్‌రెడ్డి, రైతు

మున్సిపల్ కార్మికులకు అస్వస్థత

- హోటల్ భోజనం తిన్న తర్వాత 15 మందికి వాంతులు, విరేచనాలు
- ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురు

షాద్‌నగర్ రూరల్: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. పరిశుభ్రత పనుల్లో భాగంగా షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం ఆయా కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిన కార్మికులు మధ్యాహ్నం వేళ భోజనం కోసం ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. తిరిగి వచ్చేసరికి ఆలస్యం అవుతుందనే కారణంతో 15 మంది మున్సిపల్ సిబ్బందికి అధికారులు హోటల్ నుంచి భోజనం తెప్పించారు. ఇది తిన్న కొద్ది సేపటి తర్వాత అందరూ అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో నీరసానికి గురై నిలబడలేని పరిస్థితికి చేరుకున్నారు. వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించిన అధికారులు చికిత్స చేయిస్తున్నారు. అస్వస్థతకు గురైన 15 మందిలో ఎనిమిది మంది సాయంత్రం ఇంటికి పంపించగా ప్రస్తుతం ఏడుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భోజనంలో ఏదైనా కల్తీ జరిగిందా, ఫుడ్ పాయిజన్ అయిందా లేక విధుల్లో భాగంగా చల్లిన బ్లీచింగ్ పౌడర్ కారణంగా కార్మికులు అస్వస్థతకు గురయ్యారా..? అనే కోణాల్లో విచారణ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. భోజనం శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించామన్నారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు రాజు, శ్రీనునాయక్, పద్మారెడ్డి తదితరులు ఆస్పత్రికి వెళ్లి కార్మికులను పరామర్శించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికులు

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

చైతన్యపురి: రాఖీ పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు హైదరాబాద్–2 డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 17వ తేదీ రాత్రి 7.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు.

మేనిఫెస్టో హామీల అమలుకు పోరాడుదాం

- కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కడ్తాల్: కల్లుగీత కార్మికుల హక్కులను పోరాడి సాధించుకుందామని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కేజీకేఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర' మంగళవారం ముద్వీన్ గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సుధాకర్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గీత కార్మికుల హామీల అమలుకు కృషి చేయాలని కోరారు. మంగళవారం నుంచి ఈ నెల 18వరకు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వరకు 'అమరుల యాదిలో.. గీతన్నల చైతన్య యాత్ర' కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం సంఘం గౌరవ అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ.. సంఘానికి నాయకత్వం వహించిన బొమ్మగాని ధర్మభిక్షం, ఎస్ఆర్ దాట్ల, తొట్ల మల్సూర్, బైరు మల్లయ్య, దేశిన చిన్నమల్లయ్య,, బోయపల్లి ముత్తయ్య, ఓరుగంటి జంగయ్య లాంటి అమరులను స్మరించుకుంటూ నేటి తరానికి వారి త్యాగాలను తెలుపుతూ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌గౌడ్, నాయకులు నర్సింహ, కృష్ణయ్య, వెంకటేశ్‌గౌడ్, వినోద్ ప్రజాసంఘాల నాయకులు కానుగుల వెంకటయ్య, గుమ్మడి కురుమయ్య తదితరులున్నారు.

హాస్టల్ నుంచి తాతయ్య ఇంటికి!



తాతయ్యతో విద్యార్థి కిరణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మంగళవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వనపర్తి జిల్లా పానగల్ మండలం మహందాపూర్ గ్రామానికి చెందిన యాటగిరి కిరణ్‌కుమార్(10) నెల రోజుల క్రితం నాదర్‌గుల్ టీటీడబ్ల్యూఆర్‌జేసీ(రెసిడెన్షియల్ పాఠశాల)లో 5వ తరగతిలో చేరాడు. అనంతరం 15 రోజుల పాటు హోం సిక్ సెలవులు ఇవ్వడంతో స్వగ్రామానికి వెళ్లాడు. తల్లిదండ్రులు సోమవారం విద్యార్థిని పాఠశాలలో వదిలివెళ్లారు. మంగళవారం పాఠశాల విరామ సమయంలో (ఉదయం 11.30గంటలకు) బయటకు వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ బాలజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసుల దర్యాప్తులో బాలుడు వనపర్తిలోని తాతయ్య ఇంటికి చేరినట్లు తెలిసిందన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం అడ్డగింత

బడంగ్‌పేట్: అక్రమంగా గోవులు తరలిస్తున్న వాహనాన్ని బీజేవైఎం నాయకులు కార్పొరేషన్ పరిధిలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద అడ్డుకున్నారు. తరలిస్తున్న వారిని నాయకులు ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానమిచ్చారు. దీంతో వారు మీర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ నాగరాజు అక్కడకు చేరుకుని వాహనాన్ని సీజ్ చేసి మీర్‌పేట స్టేషన్‌కు తలిరలించారు. బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సందీప్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులున్నారు.

'నయా నగరి'పై సర్కార్ నజర్

- భూసేకరణ చేసిన రైతులనుంచి వ్యతిరేకత రాకుండా చర్యలు
- త్వరలోనే ఉన్నతస్థాయి సమావేశం
- బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డికి బాధ్యతలు అప్పగించిన సీఎం



కుర్మిద్దలో టీజీఐఐసీ పేరిట మార్చిన పట్టా భూమి



కుర్మిద్దలో సమావేశమైన భూ బాధితులు

యాచారం: నయానగరి (ఫోర్త్‌సిటీ) నిర్మాణంలో అడ్డంకులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రపంచ స్థాయిలో పేరున్న కంపెనీలు నయానగరి నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తున్న నేపథ్యంలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలకు ఉపక్రమించింది. ఫార్మాసిటీ భూసేకరణకు నిర్ణయించిన 19,333 ఎకరాల్లో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో భూ వినియోగంపై సర్కార్ స్పష్టతకు వచ్చిన విషయం విదితమే. యాచారం మండలంలోని కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోనే 9,851 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరణకు నిర్ణయించి.. ఇప్పటికే 7,640 ఎకరాలకు వరకు రైతులకు పరిహారాన్ని అందజేసింది. బీఆర్ఎస్ హయాంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పెద్దలు ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ సర్కార్ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తుందని రైతులకు మద్దతుగా ఉద్యమాలు, ఆందోళనలు, భూసేకరణ చేసే గ్రామాల్లో పాదయాత్రలు చేశారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఫార్మాసిటీని రద్దు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం సేకరించిన భూముల్లో నయానగరి ఏర్పాటుకు శంకుస్థాపన చేసింది.

పోరుబాటకు సిద్ధమవుతున్న రైతులు

భూసేకరణ చేసిన గ్రామాల్లో ఫార్మాసిటీకి భూములు ఇవ్వని రైతుల పట్టా భూములను కేసీఆర్ సర్కార్ టీజీఐఐసీ పేరిట మార్చేసింది. మండల పరిధిలోని కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని 450 మంది రైతులకు చెందిన 2,211 ఎకరాల పట్టా భూములను టీజీఐఐసీ పేరు మీద మార్చి పరిహారం డబ్బును అథారిటీలో జమచేసింది. హైకోర్టు రైతులకు సానుకూలంగా తీర్పునిచ్చినా గత ప్రభుత్వం భూమలను రైతుల పేరుమీద మార్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బాధలు తప్పుతాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. దీంతో కొన్ని రోజులుగా పర్యావరణవేత్త కవుల సరస్వతి ఆధ్వర్యంలో బాధిత రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. మా పట్టా భూములు ఫార్మాసిటీకే ఇవ్వలేదు ఇప్పుడు కూడా ఇవ్వమంటూ కోర్టులోనే తేల్చుకుంటామని బాధిత రైతులు నిత్యం ఆయా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. మళ్లీ ఉద్యమ బాటకు సిద్ధం కావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కుర్మిద్ద గ్రామంలో మంగళవారం కవుల సరస్వతి ఆధ్వర్యంలో రైతులు పెద్ద సంఖ్యలో సమావేశమై పోరుబాటతోనే హక్కులు సాధించుకుందామని తీర్మాణం చేసుకున్నారు.

న్యాయం ఎలా..?

గత బీఆర్ఎస్ సర్కార్ పట్టా భూముల పరిహారాన్ని అథారిటీలో జమ చేసిన విషయం, పట్టా భూములను టీజీఐఐసీ పేరిట మార్చిన విషయం మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో సీఎం నయానగరి నిర్మాణంలో ఎలాంటి ఆటంకాలు ఎదురవద్దని.. రైతులను మచ్చిక చేసుకుని ముందుకెళ్లాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అథారిటీలో పరిహారాన్ని జమ చేసి రైతుల పట్టా భూములు అసైన్డ్ భూములకు మధ్యలో ఉండడంతో రైతులను నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పట్టా భూములున్న రైతులకు ప్రత్యేకంగా అదనపు పరిహారం ఇవ్వాలా.? మీర్‌ఖాన్‌పేటలోని హెచ్ఎండీఏ వెంచర్‌లో ప్లాట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇద్దామా.? భూములు కోల్పోతున్న రైతుల కుటుంబ సభ్యులకు అర్హత ఆధారంగా నయానగరిలో ఉద్యోగాలు కల్పిద్దామా.? అని యోచిస్తున్నారు. రైతులకు న్యాయం జరిగేలా నిర్ణయాలుండాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించారు. రైతులకు న్యాయం చేస్తూనే.. వారు నయానగరిలో భాగస్వామ్యమయ్యేలా కృషి చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం.

న్యాయం చేకూర్చే నిర్ణయం



ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులోని 14 వేల ఎకరాల్లో నయానగరి(ఫోర్త్‌సిటి) నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసక్తిగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన అమెరికా వెళ్లింది సైతం నయానగరిలో పెట్టుబడులను ఆహ్వానించేందుకే. ఫార్మాసిటీ భూసేకరణలో అథారిటీలో జమ చేసిన పట్టా భూముల రైతులకు న్యాయం చేస్తాం. కాంగ్రెస్ ఎప్పుడైనా రైతుల పక్షానే ఉంటుంది. సీఎం విదేశాల నుంచి రాగానే రైతులకు న్యాయం చేసేలా నిర్ణయం తీసుకుంటాం. ఏ రైతుకు అన్యాయం జరగనీయం. నయానగరితో ఈ ప్రాంత రూపురేఖలు మారబోతున్నాయి.

– ముదిరెడ్డి కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే



షాద్‌నగర్: విశారదన్ మహరాజ్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ

ఆ పోలీసులపై అట్రాసిటీ కేసు పెట్టాలి

- ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్
- పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, ధర్నా
- దళిత మహిళ కుటుంబాన్ని ఆదుకోవాలని నేతల డిమాండ్

షాద్‌నగర్: దళిత మహిళను చిత్రహింసలు పెట్టిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సునీత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని దాడి చేసిన పోలీసులను సర్వీస్ నుంచి తొలగించాలన్నారు. డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతను పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆతర్వాత బాధితురాలి భర్త భీమయ్య, కుమారుడితో కలిసి ఆస్పత్రి నుంచి పట్టణంలోని చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో బైఠాయించారు. బాధిత కుటుంబానికి రూ.25లక్షల పరిహారం అందించి సునీతకు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని నాయకులను సముదాయించారు.

పోలీసుల దాడి హేయనీయం

చికిత్స పొందుతున్న బాధితురాలు సునీతను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య మాట్లాడుతూ.. దళిత మహిళపై పోలీసులు విచక్షణారహితంగా దాడికి పాల్పడడం సరికాదన్నారు. మహిళకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం: ఎస్సీ మోర్చా



బాధితురాలిని పరామర్శిస్తున్న శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి

చోరీ కేసులో దళిత మహిళపై పోలీసులు థర్డ్ డి గ్రీ ప్రయోగించడం సరికాదని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షు డు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశా రు. మంగళవారం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ దళిత వ్యతిరేక పార్టీ అని.. వారి పాలనలోనే దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. సునీతపై దాష్టికానికి పాల్పడిన పోలీసులను సర్వీస్ నుంచి తొలగించి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చే శారు. ఆమెకు న్యాయం చేయకుంటే కలెక్టరేట్, సైబరాబాద్ కమిషనరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా, బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, పురుషోత్తం మనోహర్, రమేశ్, నరేందర్, జ్ఞానేశ్వర్, వెంకటేశ్, నర్సింహ, అశోక్, హరిభూషన్, కుర్మయ్య ఉన్నారు.

రాజకీయ లబ్ధికే బీఆర్ఎస్ కుట్ర

- కాంగ్రెస్ ఆదివాసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్



కేసు పెట్టిన నాగేందర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నేతలు కుట్రలు పన్నుతున్నారని.. దళితులకు అన్యాయం చేసే వారే ప్రస్తుతం నీతులు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఆదివాసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ అన్నారు. దళిత మహిళపై దాడి జరిగిన ఘటనలో బంగారం చోరీ జరిగిందని ఫిర్యాదు చేసిన ఫరూఖ్‌నగర్ హరిజనవాడకు చెందిన నాగేందర్ కుటుంబ సభ్యులను మంగళవారం ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల నిజనిర్ధారణ కమిటీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రఘునాయక్ మాట్లాడుతూ.. మహిళపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చోరీ ఘటనలో నిజాలు తెలుసుకోకుండా బీఆర్ఎస్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. రాజకీయ లబ్ధి కోసం కేసును తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు ఎస్సీ మాల కులానికి చెందిన వారేనని నాగేందర్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్‌నాయకులు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. నేడు గొంతు చించుకుని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ఎంతో మంది దళితులకు అన్యాయం చేశారని ఆరోపించారు.

న్యాయం చేయకపోతే దీక్ష

తన వివాహం కోసం పైసా పైసా కూడబెట్టి 24 తులాల బంగారాన్ని కొనుగోలు చేస్తే చోరీ చేశారని నాగేందర్ సోదరి రేణుక అన్నారు. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని.. లేని పక్షంలో దీక్ష చేస్తానని హెచ్చరించారు. కొందరు నాయకులు కేసు తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. తమకు అన్యాయం చేస్తే ఆత్మహత్యకు వెనకాడబోమని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయాలు చేస్తే సహించం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ



షాద్‌నగర్ రూరల్: దళితులను అడ్డుగా పెట్టుకుని రాజకీయాలు చేస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. బంగారం చోరీ కేసులో పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని.. దోషులు ఎవరనేది తేలిస్తేనే ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సునీతపై థర్డ్ డిగ్రీ చేశారనే ఆరోపణలు, బంగారం పోగొట్టుకున్న వారు దళితులే కావడంతో ఇరువర్గాల వారి తరఫున స్పందిస్తామన్నారు. సునీతపై థర్డ్ డిగ్రీ జరిగిందని అంటున్నా ఆమెకు మెరుగైన వైద్యం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. సునీత ఆరోగ్యంపై మెడికల్ అధికారులు హెల్త్ బులెటిన్‌ను విడుదల చేయాలని కోరారు. కేసును నిష్పక్షపాతంగా విచారించాలన్నారు. సునీతను వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

అదృశ్యమైన బాలుడు తిరుపతిలో ప్రత్యక్షం

మీర్‌పేట: మీర్‌పేట ఠాణా పరిధిలో అదృశ్యమైన బాలుడు తిరుపతిలో ప్రత్యక్షమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. దాసరి నారాయణ రావు కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి కుమారుడు మహీధర్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం ట్యూషన్‌కు వెళ్తున్నాని బయలుదేరి మార్గమధ్యలో లిఫ్ట్ ద్వారా మీర్‌పేట బస్టాప్ వద్దకు చేరుకుని బస్సులో మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద దిగి అక్కడ రైలు ఎక్కిన విషయం విదితమే. తల్లిదండ్రుల ఫిర్యాదుతో మీర్‌పేట పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. మహీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులది కర్నూల్ కావడంతో అక్కడికే వెళ్లి ఉంటాడని భావించినప్పటికీ బాలుడు నేరుగా తిరుపతికి వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నాడు. అనంతరం ఓ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ తీసుకుని తాను తిరుపతి వచ్చానని, తిరిగి వస్తున్నానని తెలుపగా వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మీర్‌పేట పోలీసులు తిరుపతి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడే ఉన్న తమ బంధువులకు అప్పగించాలని కోరినా పోలీసులు ఒప్పుకోలేదన్నారు. ప్రస్తుతం మహీధర్ రెడ్డి తిరుపతి పోలీసుల సంరక్షణలోనే ఉన్నాడని, రేపటి వరకు బాలుడిని నగరానికి తీసుకొస్తామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

వృద్ధుడికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడైన సంగెపు హనుమంత రావు(60)కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి తీర్పునిచ్చారు. కోర్టు పీపీ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. మైనర్ బాలిక తన కుటుంబ సభ్యులతో కలిసి ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో నివాసం ఉంటోంది. 2018 ఏప్రిల్ 23వ తేదీన బాలిక ఇంటి ఎదుట ఆడుకుంటుండగా అదే భవనంలో నివాసం ఉండే 60ఏళ్ల వృద్ధుడు హనుమంతరావు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన బాలిక తల్లి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, విచారించిన కోర్టు మంగళవారం పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పును ఇచ్చింది. బాధితురాలికి రూ.లక్ష పరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

యువకుడి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్ గ్రామంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బ్రదమోని సాయిరోహన్(18) తండ్రి కృష్ణ రెండేళ్లుగా పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన సాయిరోహన్ ఇంట్లోని బెడ్రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఓఆర్ఆర్‌పై ప్రమాదం

వృద్ధుడిని కారు ఢీ కొట్టడంతో అద్దంలో తల ఇరుక్కుని తెగిపడిన మొండెం

శంషాబాద్ రూరల్: దారితప్పిన వృద్ధుడు ఓఆర్ఆర్‌పై రోడ్డు దాటుతున్నాడు.. ఇదే సమయంలో వేగంగా వచ్చిన కారు అతడిని బలంగా ఢీకొనడంతో ఎగిరి కారుపై పడ్డాడు. దీంతో కారు అద్దంలో వృద్ధుడి తల ఇరుక్కుని మొండెం నుంచి వేరు పడింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడకు చెందిన తోట్ల అంజయ్య(65) నాలుగు రోజుల క్రితం ఊట్‌పల్లిలోని సోదరుడు పాపయ్య ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. నడుచుకుంటూ వెళ్తూ దారి తప్పాడు. తొండుపల్లి వద్ద ఉన్న ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి పైకి చేరుకున్నాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా.. గచ్చిబౌలి నుంచి తుక్కుగూడ వైపు వెళ్తున్న కారు అతడిని బలంగా ఢీకొంది. దీంతో ఎగిరి పడటంతో తల అద్దంలో ఇరుక్కుపోయింది. కారు వేగంతో ముందుకు వెళ్లడంతో తల నుంచి మొండెం వేరు పడింది. డ్రైవర్ వెంటనే కారు ఆపి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలికి చేరుకున్న శంషాబాద్ పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.